
# నిన్నటి చీకటి - రేపటి వెలుగు



యు. ఆర్. కృష్ణ

"పిన్నీ! బాబాయొచ్చాడు." పరుగెత్తుకుంటూ వచ్చి చెప్పి వెళ్లిపోయింది చిన్ని. శనివారం సాయంత్రం టిఫినుకి దొడ్లో పప్పు రుబ్బుతున్న అన్నపూర్ణ గుండె వో క్షణం కొట్టుకోవడం మానేసింది. చేతులు రెండూ పట్టులేనట్టు ఆగిపోయాయి. "భగవంతుడా! నన్ను కాపాడు తండ్రీ." అని మనసులో మొరపెట్టుకుంది.

"ఓ తద్దినం విరగడవుతుంటే యింకో తద్దినం తయారయ్యిందా!" లోపల గదిలో మంచంమీద పడుకుని తోటికోడలు అందరికీ వినపడేట్టు గొణుక్కుంది. అన్నపూర్ణకు యేడుపొచ్చింది. ఎవరైనా చూస్తారేమోనని నీళ్ళు లోపలకు మింగేసుకుంది.

"పప్పు రుబ్బేసింతరువాత ఆ స్టవ్వు వత్తులు సరిచేసి తొందరగా బయలు

దేరమని చెప్పవే." పదమూడేళ్ళ పెద్ద కూతురికి పురమాయించింది అన్నపూర్ణ తోటికోడలు.

పిండి గిన్నెలోకి తీసి, రోలు కడుగుతుంటే లోపలికొచ్చి "కాసిన్ని మంచి నీళ్ళియ్యి" అని యెవరినో అడిగినట్టు అడిగేడు శంకర్రావు. మొగుణ్ణి చూడగానే వొక్కసారి తత్తరపడింది అన్నపూర్ణ.మాట్లాడకుండా మంచినీళ్ళిచ్చి నుంచుంది. ఖాళీగ్లాసు అందుకుంటుంటే చిన్ని వొచ్చి, "బాబాయ్! యివాళ పిన్ని వూరెళ్ళిపోతుంది మళ్ళీ చాల రోజులగ్గాని రాదు తెలుసా!" అని అడిగింది. ఏమైనా చెబుతాడేమోనని నుంచున్న అన్నపూర్ణ మొహంలోకి చూసి మాట్లాడకుండా బయట వరండాలోనికి వెళ్ళిపోయాడు శంకర్రావు.

వంటగదిలో అన్నీ సర్దేసి జడ వేసుకుని మొహం కడుక్కుని ప్రయాణానికి తయారవుతుండగా వొచ్చి, "రాత్రి ట్రెయిన్‌కి నేను దిగబెడతాలే. ఇప్పుడొద్దు," అని చెప్పి బయటకు వెళ్ళిపోయాడు శంకర్రావు.

మంచంమీద మెలకువగా పడుకుని అంతా గమనిస్తున్న తోటికోడలు, "సరే, అతనితో పెట్టుకుంటే నువ్వెళ్ళినట్టే. రాత్రొక్కడు కాని వొచ్చే కాన్పుకి నువ్వు పుట్టింటి కెళ్లొచ్చు. అంత కొంపలేం మునిగిపోతున్నాయని ఊరుమీద పడ్డాటు. ఇన్నాళ్ళూ తిరిగింది చాల్లేదులాగుంది. తీసికెళ్ళేవాడు యీ బండికే తీసికెళ్ళకూడదూ!" అంటూ సాగదీసింది.

"వచ్చినవాడు యెలాగూ వచ్చేడుగా. అలవాటులేని ప్రయాణం వొక్క మనిషినీ పంపడ మెందుకు? ఇవ్వాళ్టికి చూద్దాం. ఒకవేళ వాడు రాకపోతే రేపు యిదే ట్రెయినుకి వెళ్తుంది." పేపరు చదువుకుంటున్న బావగారు అనగానే తోటికోడలు యేమనుకుందోగాని యింకేం మాట్లాడలేదు.

తోటికోడలన్న మాటలో నిజం లేకపోలేదనిపించింది అన్నపూర్ణకు. బయటకు వెళ్ళిన మొగుడు మళ్ళీ అంతలో వొస్తాడన్న నమ్మకం ఆమెకూ లేదు. అందర్నీ ఆశ్చర్యపరచాలన్నట్టు యింకొక ఐదు నిమిషాల్లో స్టేషన్‌కి బయలుదేరితేనేకాని ట్రెయినందదు. అనుకున్న టైముకి రిక్షాతోసహా వచ్చేడు శంకర్రావు. బయటికి వెళ్ళినప్పట్నుంచి తిరిగాడేమో మధ్యాన్నంకంటె నీరసంగా కనిపించేడు. మధ్యాన్నంవరకూ వున్న పదిరోజుల గెడ్డం యిప్పుడు లేదు కాని లోతుకు పోయిన దవడలు అంద వికారంగా కనపడుతున్నాయి.

"వాడి దగ్గర డబ్బులుంటాయని నేను అనుకోను. ఇదిగో ఛార్జీలకుంచు. వెళ్ళగానే వుత్తరం వ్రాయించు," అని బావగారు బయలుదేరే ముందు ముప్ఫై రూపాయలు అన్నపూర్ణ చేతి కిచ్చేడు. అప్పటికే శంకర్రావు రిక్షాలో కూర్చు

న్నాడు. రిక్షాలో అతని ప్రక్కన కూర్చో గానే యెవరో క్రొత్త వ్యక్తి ప్రక్కన కూర్చున్నట్టనిపించింది అన్నపూర్ణకు. సంవత్సరంనుండీ తనూ, అతనూ, భార్యా భర్తలమని, ఆ కారణంగానే తను యీ ప్రయాణం చెయ్యాల్సొస్తుందని అన్పించలేదు.

రిక్షా సందు దాటగానే "అన్నయ్యే మన్నా డబ్బులిచ్చేడా ?" అని అడిగేడు. గుప్పెట్లో మడతలు పెట్టివున్న నోట్లు అరచేయి విప్పి మాట్లాడకుండా చూపించింది శంకర్రావు కూడ మాట్లాడకుండా అవి తీసికుని జేబులో పెట్టుకున్నాడు. స్టేషన్‌లో ప్లాటుఫారమ్ చివరకు తీసికెళ్ళి "రైలు గంట లేటట. నేను టిక్కెట్లు తీసికొస్తాను. నువ్విక్కడ కూర్చో," అని చెప్పి వెళ్ళిపోయాడు.

తనీ బ్రతుకు బ్రతకలేనని, అతను చేస్తున్న పనులు మానేసి యిద్దరూ యెక్కడైనా కూలిపనైనా చేసుకుని బ్రతుకుదామనీ, తనకోసం కాకపోయినా పుట్టబోయే పిల్లలకోసమైనా బాధ్యత తెలుసుకుని మసలమని మొగుడితో చెప్పి అతన్ని మార్చడానికి చివరి ప్రయత్నం యీ గంటలోనూ చెయ్యాలనుకుంది అన్నపూర్ణ. కాని ఆమె కా అవకాశం యివ్వకుండా రైలు లైటు అవుటర్‌లో కనపడినప్పుడు కాని ఆమె దగ్గరకు రాలేదు శంకర్రావు.

లేడీస్ కంపార్ట్‌మెంటులో ఆమె నెక్కించి రెండు అరటిపళ్లు కొనిచ్చి తను ప్రక్కపెట్టెలోనే వుంటానని, స్టేషన్‌లో బండి ఆగినప్పుడల్లా వొచ్చి చూస్తుంటానని, ఆమెకేమీ భయంలేదని చెప్పి వెళ్ళిపోయేడు. తరువాత రెండు స్టేషన్లలో ఆమెతో మాట్లాడలేదు కాని ప్లాట్‌ఫారమ్ మీద అటూ యిటూ తిరుగుతూ చూసేవాడు. తిరిగి ట్రెయిన్ కదుల్తుండగా ఎక్కేవాడు.

చలిగాలికి మెడచుట్టూ పైటచెంగు కప్పుకున్న అన్నపూర్ణ మనసులో అంతులేని ఆలోచనలు దొలిచేస్తున్నాయి వెన్నెల్లో వెనక్కిపోతున్న ప్రకృతిని చూస్తుంటే గతమంతా కళ్ళముందు పరుగెత్తసాగింది. ఆ రోజు అక్కయ్య అన్న మాటలు గుర్తుకొచ్చేయి. "పూర్ణమ్మా! వాళ్ళు వెయ్యిరూపాయల కట్నానికి వొప్పుకుని ఆ దేవుడి దయవల్ల ఈ పెళ్ళి జరిగిపోతే నువ్వు అదృష్టవంతురాలివేనే. కుర్రాడు హైదరాబాదులో వుద్యోగం చేసుకుంటున్నాడు. అత్తా, ఆడబడుచుల పోరు లేదు. పెళ్ళి చూపులకొచ్చిన అన్నగారింటికి యెప్పుడైనా వెళితే మీరిద్దరూ చుట్టం చూపుగా వెళ్ళడమే. అతడు సంపాదించుకున్న దాంతో మీరిద్దరూ హాయిగా బ్రతకొచ్చు. నువ్వన్నా సుఖంగా వుంటే నాకంతే చాలు," అంది ఆనందంతో అన్నపూర్ణ అక్క.

తన అదృష్టం యింత అందంగా

వుందని తెలిస్తే అక్కయ్య యెలా మురిసిపోతుందో అనుకోగానే అన్నపూర్ణ కళ్ళమ్మట నీళ్ళొచ్చేయి.

చిన్నప్పుడే తల్లీ, తండ్రీ పోతే... 'వీళ్ళ బరువు మా నెత్తిమీద పడేట్టుంది' అని భయపడ్డవాళ్ళెవరో పదమూడేళ్ళ అన్నపూర్ణ అక్కని వో నలభై యేళ్ళ అయ్యకి రెండో పెళ్ళాంగానూ, అతని మొదటి భార్య ముగ్గురి పిల్లలకు తల్లిగాను చేసి బరువు లొదుల్చుకున్నారు. అన్నపూర్ణ కూడ అక్కతోపాటు బావ యింటికి చేరింది. అన్నపూర్ణ తన యింటికి రావడం అక్క మొగుడికి యే యిబ్బందీ కలిగించకపోయినా సంవత్సరాలు గడిచేకొద్దీ ఆడపిల్ల బరువు యెంతటిదో అతను గుర్తించేడు. ఆ యింటిలో పెద్దకూతురిలాగే తిరిగేది అన్నపూర్ణ. తరుడుపారంతో చదువాపేసి యింటిలో అన్నివిధాలా అక్కకి సాయం చేసేది. అక్కకి పురుళ్ళు పోసి అక్క సొంతపిల్లల్నీ, సవతి పిల్లల్నీ సాకేది.

అక్కమొగుడిలో మంచితనం వుంది. పిల్లల్ని కనడంలో వుషారూ వుంది. కానయితే డబ్బుసంపాదనలో చాల నీరసంగా వుండేవాడు. అన్నపూర్ణ ఆ యింటి కొచ్చింతరువాత అతను నాలు గైదు రకాల వ్యాపారాలు చెయ్యడం, అన్నింటిలోనూ దిగ్విజయంగా నష్ట పోవడం జరిగింది. దాంతో తాతలు సంపాదించిన కొంత పొలమ్మూ, యిల్లూ అమ్మేసి అద్దెయింటిలో గృహప్రవేశం చేసి వో పెద్ద బట్టలకొట్లో చిన్న లెక్కల గుమాస్తాగా అవతారం యెత్తాడు. ఇందులో అన్నీ యిబ్బందులే. నెల చివరా రెండుపూటలా తినడానికి తిండీ, కట్టుకోడానికి శుభ్రమైన బట్టా నిషేధించుకోవాల్సి వొచ్చేది.

బావ పడుతున్న బాధ కాస్తయినా తగ్గిద్దామనే వుద్దేశంతో అన్నపూర్ణ యింటిలో పని తొందరగా ముగించుకుని వీధి చివర వున్న అప్పడాల మామ్మ దగ్గరకు పోయి అప్పడాలు వత్తి, వడియాలు పెట్టి పావలా, అర్ధా తెచ్చి యింటిలో యిచ్చేది. అప్పడాల మామ్మ మొగుడు పోకపూర్వం యే పేరుతో పిలువబడేదో కాని మొగుడు పోయి పిల్లలు రెక్కలొచ్చి యెగిరిపోయిం తరువాత అప్పడాల మామ్మగా స్థిరపడి పోయింది. అప్పడాలూ, వడియాలూ పెట్టి ఆ వూరి కొట్లమీదకీ, హోటళ్ళ లోకీ హోల్‌సేల్‌గా సప్లైచెయ్యడమే కాకుండా యింటిదగ్గర రిటెయిలుగా కూడ అమ్ముతుండేది. పార్ట్‌టైమ్‌గా అన్నపూర్ణలాంటివాళ్లు ఆమె దగ్గర యెప్పుడూ వో అరడజనుమంది పనిచేస్తుంటారు.

పెళ్ళిగురించి అన్నపూర్ణకు గొప్ప ఆశలేం లేవు. ఎవడో రాజకుమారుడు వచ్చి తనని పడవకార్లలో తిప్పుతాడని

యెప్పుడూ అనుకోలేదు. పడవకార్లూ, అద్దాలమేడలూ తెలియవని కాదు. తెలిసికో తగినన్ని సినిమాలూ, ఎదురింటి యిన్‌కమ్‌టాక్సు గుమాస్తాగారి పత్రికలు ఆమెకు చాలాకాలం అందుబాటులోనే వున్నాయి. గుర్రమెక్కి ఊహాలోకాల్లో విహరించాలని అనిపించి కొంతదూరం వెళ్ళినా వెంటనే వాస్తవానికొచ్చేసి కళ్ళెం లాగి దిగొచ్చి గుర్రాన్ని కట్టేసేది.

అక్క వెయ్యిరూపాయిల కట్నం గురించి చెప్పి రాబోయే తన అదృష్టాన్ని వెతుకుతున్నప్పుడు కూడ మగపెళ్ళివారు వొప్పుకుంటారా వొప్పుకోరా అన్న ఆలోచనకంటె వొకవేళ వొప్పుకుంటే వెయ్యిరూపాయిలు బావ యెక్కడ నుంచి తెచ్చియిస్తాడు అన్న సమస్యే వేధించిందామెను. చాలీచాలని వాళ్ళ బ్రతుకుల్లో యింతకాలమూ వాటా తీసి కోవడమేకాకుండా యింకోచోటికి పోయే ముందు కూడ మోయలేనంత బరువుని వాళ్ళమీద పెట్టాల్సొచ్చినందుకు తన పుట్టుకను తిట్టుకొంది.

నెల చివరి రోజుల్లో వో కిలో బియ్యం కూడ అప్పుగా తేలేని బావ అంత డబ్బు యెలా తెచ్చాడో యెప్పుడు తెచ్చాడో కాని అన్నపూర్ణ పెళ్ళి శంకర్రావుతో జరిగిపోయింది. పెళ్లిచూపులకు అతని వదినగారూ, అన్నగారూ మాత్రమే రావడంతో మెడలో మంగళ సూత్రం కట్టింతరువాతే మొగుణ్ణి చూసింది అన్నపూర్ణ.. చూసి ఆశ్చర్య పోయింది. తన ప్రక్కన నుంచుంటే అతను చాలా అందంగా వుంటాడను కుంది. అనుకోని అదృష్టానికి ఆనంద పడింది.

పెళ్లైన వారానికే మొగుడితో కాపు రానికి హైదరాబాదు వెళ్లిపోయింది. పది రోజుల కాపురంలోనే తనను వరించిన అదృష్టం యెంతటిదో, యెటువంటిదో చూచాయగా తెలిసికోగలిగింది. తెలుసు కుని యేం చెయ్యాలో తెలియక వొణికి పోయింది. మొగుడు కూడ తరుదు ఫారం దాటలేదని, యిప్పుడు చేస్తున్నా ననుకుంటున్న వుద్యోగం టెంపరరీగా వాళ్ళ అన్నయ్య యిప్పించిందని, అది కూడ పెళ్ళికి రెండురోజుల ముందుగానే వూడిపోయిందని, మొగుడూ తనూ తన కట్నం డబ్బులో పెళ్ళిఖర్చులకి పోను మిగిలినదానితోనే యీ పదిరోజులుగా కాపురం వెలిగిస్తున్నారని. మొగుడు తాగుడు, జూదంలాంటి విద్యల్లో అపార పారంగతుడని, ఆడదాని సుఖంకోసమే తనని పెళ్ళాడాడే తప్ప తననో మనసున్న మనిషిగా చూడలేదని వొక్కొక్కటి తెలుసుకుని యేదో మాయల వుచ్చులో బిగింపబడుతున్నట్టు ఫీలయ్యింది.

కొత్తలో రాత్రుళ్ళు యింటికొచ్చే వాడు పగలంతా బయట తిరిగి శంకర్రావు. తరువాత్తరువాత రెండుమూడు

రోజులగ్గాని యింటికొచ్చేవాడు కాదు. యేంచేసేవాడో అన్నపూర్ణకు తెలియదు కాని అప్పుడప్పుడు ఐదూ, పదీ ఇంటిలో యిచ్చేవాడు. ఏదైనా పనికోసం ప్రయత్నంచేసి బయట తిరక్కుండా వేళ పట్టుకు యింటికొస్తుండమని మొగుడితో అన్నపూర్ణ ధైర్యంచేసి చెప్ప బోయిందికాని తన విషయాల్లో జోక్యం కలిగించుకోవద్దని శంకర్రావు చిటపట లాడుతూ చెప్పడంతో మౌనంగా ఏడవడం తప్ప యేమీ చెయ్యలేక పోయింది. ఇదంతా తాత్కాలికమే అవి, ముందు ముందు యెవరో వచ్చి తన బ్రతుకు బాగుచేస్తారని కొంతకాలం ఆశపడింది కాని రోజులు గడిచేకొద్దీ అది వట్టి ఆశమాత్రమేనని, ఇంతకాలం తెరవెనుక వుండి యిప్పుడు తెరముందుకి వచ్చిందని యీ నాటకంలో తన పాత్ర తను పోషించాల్సిందేనని ధైర్యం తెచ్చు కోడానికి ప్రయత్నం చేసింది.

రెండు నెలలు పోయిం తరువాత వోరోజు బయటకు వెళ్ళిన శంకర్రావు వారం రోజుల వరకూ యింటికి రాలేదు. అంతకాలం యింటికి రాకుండా యీ రెండు నెలల్లోనూ యెప్పుడూ లేదు. అతని కేమైందోనని భయపడి వేరే వూరిలో వున్న తోటికోడలికీ, ఆవిడ మొగుడికీ కలిపి వో వుత్తరం రాసింది. వారం రోజుల తరువాత పాతిక రూపా యల మనియార్డరూ భయపడాల్సిన పనేమీ లేదని వుత్తరమూ వొచ్చేయి. ఆ తరువాత పదిహేను రోజులు చూసింది. ఓ రోజు హఠాత్తుగా మొగుడు రాలేదుకాని అతని తోడపుట్టిన పెద్దమనిషొచ్చి వున్న సామాను సర్దించి వుంటున్న గది ఖాళీ చేయించి తమ వూరికి తీసుకు పోయేడు అన్నపూర్ణను. అప్పటికి తోటి కోడలు ఆరవ కాన్పుకి రెండు నెలల దూరంలో రడీగావుండి యింటిలో పిల్లల్తో చేసుకోడానికి యిబ్బంది పడుతుంది.

మొగ మనిషిని మొగుడి వివరాలు అడగడానికి సిగ్గుపడింది కాని తోటి కోడల్ని అడిగేసింది అన్నపూర్ణ.

"నీకంటె తెలీదు కాని అలా వెళ్ళి పోయి దేశంమీద పడి తిరగడం అతనికి మామూలే. తిరిగి తిరిగి తోచినప్పుడు యింటికొస్తాడు. ఈ భాగోతం నేను యీ యింటి కోడలిగా వొచ్చిందగ్గర్నుంచీ చూస్తున్నాను. అన్నేళ్ళు వొచ్చినయ్ యెందుకూ పొయ్యిలో పెట్టుకోనా! ఈయనేమో వాడి కాళ్ళూ, వీడి కాళ్ళూ పట్టుకుని వుద్యోగం యిప్పించడం అతనేమో వాళ్ళ కొవ్వెక్కి వొదిలేసి పోవడం. పెళ్ళికూడ చేసికున్నాడు బుద్ధుండక్కర్లేదూ! అం! నా తెలివి తక్కువ కావి వల్ల కాటికి పోయినప్పుడే అతనికి బుద్ధొచ్చేది." అంటూ మూతి ముప్పయి వంకర్లు తిప్పింది.

అన్నీ తెలిసుండి తన గొంతు

యెందుకు కోసేరని, మంచి వుద్యోగం చేసికుంటున్నాడని అబద్ధం యెందుకు చెప్పేరని, వెయ్యి రూపాయల కట్నం కోసం యీ జన్మలో తీర్చలేని అప్పు తనవాళ్ళచేత యెందుకు చేయించేరని, యెన్నెన్నో అడగాలనుకుంది అన్న పూర్ణ. గొంతు మూగపోయి నిశ్చేష్టు రాలై కూర్చుండిపోయింది.

ఆ యింటిలో ఆలిన్‌వన్‌గా త్వర గానే మారిపోయింది అన్నపూర్ణ. తెల్లారిలేచి పొయ్యి వెలిగించడం దగ్గ ర్నుంచి రాత్రి పదయ్యే వరకూ అన్ని పనులూ అన్నపూర్ణే చెయ్యవలసి వచ్చేది. అన్నపూర్ణ వొచ్చింతరువాత తోటి కోడలు పూచికపుల్ల కూడ పక్కన పెట్టడం మానేసింది.

'అబ్బ. పెళ్ళైం తరువాత యిన్నే ళ్ళకు ప్రాణం హాయిగా వుంది. ఈ పిల్లలతో యెలా వేగడమా, పురుడు యెలా పోసుకోవడమా అని బెంగెక్కు వైపోయింది. అన్నపూర్ణ పుణ్యమా అని ఆ సమస్య తీరిపోయింది. భగ వంతుడు కరుణిస్తే యింకో పురుడు కూడ నిశ్చింతగా పోసుకోవచ్చు. కాని వోమనిషిని పోషించాలంటే కష్టమే మరి అయినా తప్పదు. అయినవాళ్ళం కాబట్టి పెట్టాలి. ఏ మాట కామాటే చెప్పుకో వాలి పనిమనిషికైతే మాత్రం యింత అవ్వదూ. ఓ పూట తిండిపెట్టి నెలకి పదిరూపాయ లిస్తామని టైముకొచ్చి లెక్క ప్రకారం చేసిపోతారే తప్ప అర్ధ రాత్రి అయినా అపరాత్రయినా దీనిలా చేస్తారేమిటి ?' అని ప్రశ్నించుకుని సంతోషపడింది తోటికోడలు. దుర దృష్టవశాత్తూ ఆవిడ ఆనందం యెక్కువ కాలం నిలవలేదు.

అన్నపూర్ణ చేత సేవలు నెలైనా చేయించుకోక ముందే అన్నపూర్ణ మూడు నెలల గర్భవతని వీధి చివరవున్న డాక్టరమ్మ కన్ఫర్మ్ చేసి చెప్పడంతో తోటి కోడలికి యెక్కడలేని కోపం వొచ్చింది. తను తప్ప ఆ యింటిలో యింకెవరూ పిల్లలు కనకూడదనుకుందో యేమో విశ్వరూప ప్రదర్శన ఆనాటి నుండే మొదలుపెట్టింది. ఏదో వంకతో సూటీ పోటీ మాటలు అని వాటి ఫలితం అన్నపూర్ణ మొహంలో చూసి ఆనం దించేది. తినడానికి తిండి లేకపోయినా పెళ్ళిళ్ళు చేసికోడం, యేంవున్నా లేక పోయినా సిగ్గూ యెగ్గూ లేకుండా వెధవ పనులు చెయ్యడం, ఆ తరువాత పిల్లల్ని కనేసి వూరిమీద పారేయడం.. వొక టేమిటి ఆవిడ ప్రవాహం ఆగాలంటే నోరు నొప్పెట్టాల్సిందే. రోజు రోజుకీ అన్నపూర్ణ శరీరంలో పెరుగుతున్న బిడ్డతోపాటే తోటికోడలి కోపం కూడ యెక్కువయ్యేది. మాటిమాటికీ తేరగా కూర్చుని తినేవాళ్ళు యెక్కువైపోయా రని తిట్టేది. తిట్లతోనే కడుపు నింపు

కుని గుప్పెడు మెతుకులతోనే లేచి పోయేది అన్నపూర్ణ.

తోటికోడలుకి ప్రసవం కష్టమయ్యి హాస్పిటల్‌లో చేర్చినపుడు శంకర్రావొచ్చి రెండురోజులుండిపోయేడు. ఏదో వూరిలో వుద్యోగం చేస్తున్నానని, యింటి కోసం వెదుకుతున్నానని మంచి పోర్షను దొరకగానే అన్నపూర్ణను తీసికెళ్తానని చెప్పేడు. ఇంతకాలానికైనా కష్టాలు గట్టెక్కబోతున్నందుకు దేవుడికి మొక్కుకుంది. రెండు రోజులూ అయిష్టంగానైనా అతనికి శరీరం అర్పించుకుంది అన్నపూర్ణ. ఆ తరువాత నాల్గురోజులు కాదు కాని నాలుగు నెలలయినా అతడు రాలేదు. కాని తోడికోడలి తరపుమనిషి చుట్టం చూపుగా వొచ్చి వో బాంబు పేల్చి వెళ్ళిపోయాడు. గుంటూరు స్టేషన్‌లో యెవరిదో పర్సు కొట్టేస్తుంటే పట్టుకుని చితక తన్ని పోలీసుల కప్పచెప్పేరట శంకర్రావుని. అర్ధరాత్రి తరువాత వంటగది ప్రక్క వరండాలో చాపమీద పడుకుని కరువు తీరా యేడ్చి చచ్చిపోవాలని నిర్ణయించుకుంది. రెండుమూడు సార్లు ప్రయత్నించినా చివరి క్షణంలో పెరుగుతున్న బిడ్డను చూసి ధైర్యం చెయ్యలేకపోయింది.

ఇవతల నెలలు నిండుతుంటే తోటికోడలికి క్రొత్త భయం పట్టుకుంది. "ఇంతకాలం యిది చేసిపెడుతుంటే బాగానే వుంది. తొమ్మిది నెలలూ యిక్కడే నింపేసుకుంటే అదిచెయ్యటం లేకపోగా యెదురు సేవలు నేను చెయ్యాలి. అక్కడితో ఆగిపోతే అందంగానే వుంటుంది. అసలే తొలి కాన్పు. ఖర్మకాలి యేదేనా కష్టమయ్యి అయ్యేదేదో తిన్నగా అయ్యి చావకపోతే హాస్పిటల్ చుట్టూ తిరగడం, డాక్టరు ఫీజులు మందులూ మాకులూ, యివన్నీ తడిసి మోపెడవుతుంది. ఆ తరువాత యిల్లు గుల్లవడం ఖాయం. చాల్చాలు. యీ సంతంతా నెత్తిమీద పెట్టుకుని నేనూరేగలేను బాబూ!" అనుకుని "అన్నపూర్ణకి తొమ్మిదోనెల నడుస్తుంది కాబట్టి, మొదటి కాన్పు పుట్టింటిలోనే పోసుకోవడం మా ఆనవాయితీ కాబట్టి మీరు వొచ్చి అమ్మాయిని తీసుకుని వెళ్ళవలసినది. చిత్తగించవలెను. ఇట్లు" అని మొగుడిచేత సంతకం పెట్టించి అన్నపూర్ణ అక్కకి బావకి వుత్తరం రాయించింది.

ఆ వుత్తరం తరువాత వెంట వెంటనే మరో రెండుత్తరాలు వెళ్ళాయి. అవి అవతలివారికి అందినయ్యో లేదో అందినా అందనట్టు వూరుకున్నారో తెలియదు. అన్నీ తెలుసుకునే తెలియనట్టు నటిస్తున్నారంది తోటికోడలు. తెలిస్తే వాళ్ళ పస్తులుండయినా తనను తీసికెళ్తారు కాని పట్టనట్టు అక్కా, బావా వూరుకోరనుకుంది అన్నపూర్ణ. "ఎవరికీ

బరువుకాకుండా యేదైనా మార్గం చూపించు తండ్రీ?" అని రోజూ భగవంతుణ్ణి కోరుకునేది.

"తెలియక మోసపోయి మీ యింటితో సంబంధం పెట్టుకున్నాం. మీవాళ్ళకసలు నీతి జాతి వుందా? పెళ్ళైన మొదటి సంవత్సరంలోనైనా వో అచ్చటా ముచ్చటా తీర్చాలని తెలియదూ! వదిలించే చాలని కాళ్ళు కడిగి పంపించి చేతులు కడుక్కుంటారా? ఇంత డబ్బు కక్కుర్తి దిక్కుమాలిన మనుషుల్ని నేనెక్కడా చూళ్లేదమ్మా. ఇలాంటివాళ్లే పైసా ఖర్చుకి భయపడి అవతల ప్రాణాలు పోతున్నా మందు కూడ పోయించకుండా నిలువునా ప్రాణాలు తీసేస్తారు. సొంతవాళ్ళకు లేని యిది నాకెందుకుండాలి? అడ్డమైనవాళ్ళకూ నేను చెయ్యలేనమ్మా." అంటూ అన్నపూర్ణని ప్రయాణానికి సిద్ధం చేయించింది.

సిగ్నల్ యివ్వక అవుటర్‌లో బండి ఆగడంతో గతంనుంచి బయటపడింది అన్నపూర్ణ. గబగబా కళ్ళనీళ్ళు తుడుచుకుంది. కంపార్ట్‌మెంటులో అందరూ కూర్చునే నిద్రపోతున్నారు. మధ్యాన్నం ప్రయాణపు హడావిడిలో గుప్పెడు చారు మెతుకులూ సహించక యెవరూ చూడకుండా పారబోసి కంచం కడిగి పెట్టేయడంవల్ల ఆకలిగా వుంది. సంచిలో అరటిపళ్ళు వున్నాయి. కాని తినాలనిపించలేదు.

చల్లగాలికి మాగన్నుగా నిద్రపట్టింది అన్నపూర్ణకి. మళ్ళీ టికెట్ కలెక్టరు లేపి టికెట్టడిగినప్పుడు కాని మెలకువ రాలేదు మత్తులో. ముందు నోటమ్మట మాట రాకపోయినా, పగవారు ప్రక్క పెట్టెలోవున్నారని ఆయన దగ్గర టిక్కెట్టు వుందని చెప్పింది. ప్రయాణం చేసేప్పుడు యెవరి టిక్కెట్టు వాళ్ళదగ్గరే వుంచుకోవాలని ప్రక్కస్టేషన్‌లో బండి వో పది నిముషాలు ఆగుతుంది కాబట్టి టికెట్ చూపించమని చెప్పేడాయన.

రైలాగ్గానే టికెట్ కలక్టరుతో పాటు తనూ దిగి మొగుడికోసం చూసింది అన్నపూర్ణ. దూరం నుండి అన్నపూర్ణ వున్న చోటుకి వస్తున్న శంకర్రావు హఠాత్తుగా వెనక్కి తిరిగి జనం మధ్య కలసిపోయి అన్నపూర్ణకు కనిపించలేదు. టికెట్ కలెక్టరు కోపానికి, విసుగుదలకూ భయపడి అటునుండి యిటూ, యిటు నుండి అటూ తిరిగి శంకర్రావుకోసం చూసింది కాని అతనెక్కడా కనపడలేదు. టికెట్ కలక్టరు మాటలనిబట్టి మొగుడు టిక్కెట్టు కొనకుండా తనని ప్రయాణం చేయిస్తున్నాడని, యిప్పుడు తన దగ్గర కొస్తే అతన్ని కూడ పట్టుకుంటారని భయపడి తప్పించుకున్నాడని అర్థమయ్యేసరికి యేడుపొచ్చింది అన్నపూర్ణకి. ఏమనుకున్నాడో యేమో కాని అన్నపూర్ణని అక్కడ దింపేసి కదుల్తున్న రైలెక్కేడు టికెట్ కలెక్టర్.

* * *

ప్లాట్ ఫారమ్ చివర కాస్త వెనుకగా వున్న చెట్టు క్రింద సగం విరిగిపోయిన సిమెంటు బెంచీ మీద అన్నపూర్ణ ముడిచి పెట్టుకూర్చుంది. చేతి సంచీని, పసి బిడ్డను వొళ్ళో వేసుకున్నట్టు మోకాళ్ళ మీద పెట్టుకుని గట్టిగా పట్టుకుంది. దూరానవున్న సిగ్నల్ లైట్లు మసగ వెలుతురుతో పోటీపడుతున్నాయి. సన్నగా కురుస్తున్న మంచుతో వెలిసిపోయిన చీర ముసుగేసుకున్నట్టుంది ప్రకృతి. చెట్టుమీది పక్షులు యెన్నికల ముందు నాయకులు వుపన్యాసాలిస్తున్నట్లు ఆగకుండా అరుస్తున్నాయి. ఎదుటి ప్లాట్ ఫారానికి వో చివర నలుగురు కుష్టువాళ్ళు రైల్వేబొగ్గుతో చలి కాచుకుంటుంటే వో పోర్టరు వెళ్ళి తనూ కూచున్నాడు. రాత్రి రైలు తరువాత యెక్కువ బళ్ళు ఆగలేదు అక్కడ అది పెద్ద స్టేషన్ కాకపోవడంతో. మళ్ళీ యిప్పుడిప్పుడే జనం వొస్తున్నారు స్టేషన్లోనికి.

అర్ధరాత్రి నుండీ అలాగే కూర్చుని కరువు తీరా యేడ్చింది అన్నపూర్ణ. ఏడ్చి ఏడ్చి అలిసిపోయింది. కన్నీళ్ళద్వారా హృదయంలోని బాధంతా కడిగివేయబడి బయటకుపోయినట్టు మనసు యిప్పుడు తేలిక పడింది. రాత్రివున్నంత భయం కూడలేదు.

“ఆలోచిస్తే యీరోజు తనకు ప్రత్యేకంగా జరిగిన అన్యాయం యేముంది? ఇంతకాలం యే చిన్న గాలికైనా కూలిపోయే యింటిలోవుండి తనకో నీడ వుందని మురిసిపోయింది. అది యేక్షణంలోనైనా కూలొచ్చని, కూలి తన బ్రతుకు బుగ్గిచేస్తుందని తెలిసిన తరువాత వ్యర్థప్రయత్నంచేసి కూలకుండా నిలబెట్టుకోగలనని తనని తాను నమ్మించుకుంది. తను నిండుగా బ్రతకాలంటే ఆ కప్పు క్రిందనుండి బయటకు వొచ్చేయాలని అప్పుడప్పుడు అజ్ఞాతంగా యెవరో చెబుతున్నట్టు అనిపించినా ధైర్యం చెయ్యలేకపోయింది. చివరికి బలవంతంగా తోసేస్తే తప్ప బయటకు రాలేకపోయింది. ఇప్పుడు కూడ మళ్ళీ వెనక్కు వెళ్ళడం మూర్ఖత్వమే అవుతుంది. ఆ మాత్రపు నీడ తన ప్రయత్నంతో తను కల్పించుకోగలదు. ఆ ప్రయ్నతంలో తమ సమిధనైనా సరే.” ధృఢనిశ్చయానికొచ్చినట్టు అన్నపూర్ణ మెల్లగా స్టేషన్ బయటకు నడిచింది.